జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజా జ్యోతి

ప్రతి అక్షరం- ప్రజల కోసం

నిజామాబాద్

శుక్రవారం 31 మే 2024 పేజీలు 8



# ఉపాధికి ఊతం.. రైతులకు లాభం

### పొలాలకు చెరువు మట్టి తరలింపు

### జోరుగా చెరువుల్లో పూడిక తీత పనులు

**నిజామాబాద్ :** వేసవిలో వ్యవసాయ, ఇతర పనులు లేక కూలీలు, సన్న, చిన్నకారు రైతులు ఉపాధి హామీ పనుల వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లోని నోటిఫైడ్ చెరువుల్లో పూడికతీత పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మండల వ్యాప్తంగా 3వేల మంది కూలీలు పనులు చేస్తున్నారు. చెరువుల్లోని ఒండ్రు మట్టిని రైతులు సొంత ఖర్చులతో ట్రాక్టర్లు పెట్టుకుని తమ పొలాలకు తరలించుకుంటున్నారు. పొలాలకు సారవంతతమైన మట్టిని ముమ్మరంగా తరలిస్తున్నారు. ఏటేటా రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గుతోంది. ఈ క్రమంలో ఒండ్రు మట్టిని తరలించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. అధికారులు కూడా ఒండ్రు మట్టి ప్రాధాన్యం గురించి రైతులకు వివరిస్తున్నారు. భూమిలో పోషకాలు పెంచేందుకు చెరువు మట్టి ఎంతో ఉపకరిస్తుందని పేర్కొంటున్నారు. చెరువుల్లో నీరు తగ్గిపోవడంతో పొలాలకు మట్టిని తరలిస్తున్నారు.



# ఆపత్తి

- ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల ఉధృతి
- పెరిగిన పెట్టుబడులు, పడిపోయిన దిగుబడులు
- నాలుగేళ్లుగా భారీగా నష్టపోతున్న రైతులు

**నిజామాబాద్ ప్రజాజ్యోతి**

తెల్ల బంగారంగా పిలిచే పత్తి సాగు ఏటా రైతులకు నష్టాన్ని మిగుల్చుతోంది. రెండు దశాబ్దాలుగా రైతులు ఎన్నో ఒడిదొడుకు లు ఎదుర్కొని పంట సాగుచేస్తుండగా, నాలుగేళ్లుగా గిట్టుబాటు కావడం లేదు. ప్రకృతి వైపరీత్యాలు, నకిలీ విత్తనాలు, తెగుళ్ల ఉధృ తి, పెరిగిన పెట్టుబడులు, పడిపోయిన దిగుబడులతో రైతులు నష్టపోతున్నారు. అయినా రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించకపోవడంతో కోలుకోలేకపోతున్నారు. వర్షాధార పంటల్లో పత్తి సాగుదే ప్రథమ స్థానం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 9లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతోందని అంచనా. దశాబ్దాలుగా మెట్ట పంటగా సాధారణ పత్తి సాగు చేస్తున్న రైతు లు ఆర్థికంగా దెబ్బతిన్నారు. పంటకు పురుగుల ఉధృతి అధికం కావడంతో పెట్టుబడులు కూడా రాక రైతులు ఆత్మహత్యలు చేసుకున్న ఘ టనలు ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జన్యు మార్పిడితో వచ్చిన పత్తి బీటీ (బాసిల్లస్ తురంజిన్సీస్) సాగు 2011 ఏడాది నుంచి ఉమ్మడి జిల్లాలో ఊపందుకుంది. ఈ మొక్కలో ఉన్న జన్యువుల కారణంగా గులాబి పురుగు, పొగాకు లద్దె పురుగు, పచ్చ పురుగులు వ్యాప్తి ఉండే ది కాదు. ఎకరా ఎర్ర నేలల్లో 10 క్వింటాళ్లు, నల్ల నేలల్లో 15క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. కాలక్రమేణ పరిస్థితి మారింది. బీటీ పత్తిలో సైతం తెగుళ్ల వ్యాప్తి అధికమైంది. ప్రధానంగా 2020 ఏడాది నుంచి పత్తి సాగులో రైతులకు ఒడిదొడుకులు మొదలయ్యాయి. నాలుగేళ్లుగా వరుసగా ఎకరానికి కనీసం 2క్వింటాళ్ల నుంచి 5 క్వింటాళ్లకు మించి దిగుబడి రాక రైతులు నష్టాల పాలయ్యారు.

# అంచనా తప్పింది

- అధికారుల లక్ష్యం 1,21,440 మెట్రిక్ టన్నులు
- కొనుగోలు చేసింది 2,890 మెట్రిక్ టన్నులే..
- సన్నాలకు డిమాండ్ ఉండటంతో బయటి మార్కెట్‌కు తరలిన ధాన్యం
- లబోదిబోమంటున్న మిల్లర్లు

**నిజామాబాద్:** వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాల అధికారుల అంచనా తప్పింది. జిల్లాలో యాసంగిలో సాగైన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 1,21,440 మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా వేశారు. కానీ 2,890 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. వచ్చిన ధాన్యాన్ని ఎంపిక చేసిన మిల్లులకు తరలించారు. రైతులకు రూ.6.22 కోట్లు చెల్లించారు. ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 49 సెంటర్లు, మెప్మా ఆధ్వర్యంలో రెండు, పీఏసీయస్ ఆధ్వ ర్యంలో దాదాపు తొమ్మిది సెంటర్లు ప్రారంభించారు. కానీ ఒక్క ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 సెంటర్లలో మాత్రమే ధాన్యం సేకరించారు. అందులో గద్వాల మండలంలోని గుర్రంగడ్డ, బీరోలు, లత్తిపురం, తెలుగోనిపల్లి, బస్రాచెరువు, రేకులపల్లి ఉండగా ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి, తిమ్మాపూర్, జింకలపల్లి, ధరూర్ మండలంలోని రేవులపల్లిలో మాత్రమే కొనుగోలు చేశారు. మొత్తం కొనుగోలు 2,890 మెట్రిక్ టన్ను లు కాగా ఇందులో 1,275 మెట్రిక్ టన్నులు దీవి గ్రామం గుర్రంగడ్డ నుంచే కొనుగోలు చేశారు.

**జూరాల కింద క్రాప్ హాలిడే ఇవ్వడంతో..**

ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా జూరాల ప్రాజెక్టు కింద రబీలో క్రాప్ హాలిడే ప్రకటించారు. దీంతో వేల ఎకరాలలో సాగు నిలిచిపోయింది. అయినప్పటికీ రైతులు బోర్లు, బావుల కింద, కృష్ణానది పరివాహక గ్రామాలలో దాదాపు 20,240 హెక్టార్లలో సాగు చేశారు.



బోర్లు, బావులు అడుగంటి పోవడంతో పంటలు ఎండిపోయాయి. ఇది కొంత దిగుబడిపై ప్రభావం చూపింది. కానీ వ్యవసాయ అధికారులు హెక్టారుకు 7.5 మెట్రిక్ టన్నుల చొప్పున 20,240 హెక్టార్లలో 1,51,800 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని, అందులో అవసరాలకు పోను కొనుగోలు కేంద్రాలకు 1,21,440 మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా వేశారు.

# అక్రమంగా చెరువులో మట్టి తరలింపును అడ్డుకున్న చిక్కడపల్లి గ్రామస్తులు





**రుద్రూర్, మే 30 (ప్రజా జ్యోతి) :** ఏలాంటి అనుమతులు లేకుండా కనీసం గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండా చిక్కడపల్లి చెరువులో మట్టి తరలింపును గ్రామస్తులు అడ్డుకున్నారు. రుద్రూర్ మండలంలోని చిక్కడపల్లి గ్రామ చెరువులో అంబం గ్రామానికి చెందిన రైతు శానం హనుమాన్లు తన వ్యవసాయ భూమిలోకి ఎలాంటి అనుమతి లేకుండా చెరువులోని మట్టిని తరలిస్తుండగా చిక్కడపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. అనంతరం రుద్రూర్ తహసిల్దార్ వెంకటేష్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తహసిల్దార్ వెంకటేష్ సంఘటన స్థలానికి చేరుకొని అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు, జెసిబిని స్వాధీన పరచుకొని రెవిన్యూ ఇన్స్పెక్టర్ నజీర్ ద్వారా పంచనామా నిర్వహించి ట్రాక్టర్లను, జెసిబిని రుద్రూర్ పోలీసులకు అప్పగించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ అప్పారావు ఆరు ట్రాక్టర్లను ,జెసిబిని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ.. చిక్కడపల్లి చెరువులో మట్టి తవ్వకాల కోసం ఎలాంటి అనుమతులు లేవని, అక్రమంగా మట్టి త్రవ్వకాలు జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ తెలిపారు.

# రైతులు లైసెన్సు ఉన్న దుకాణాలలో విత్తనాలు ఎరువులు కొనుగోలు చేయాలి

**సిరికొండ, మే 30 (ప్రజా జ్యోతి) శ్రీనివాస్:** రైతులు విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసే ముందు లైసెన్స్ ఉన్న దుకాణాలలో మాత్రమే కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ అన్నారు గురువారం మండలంలోని చిన్నవాల్గొట్, సర్పల్లి తాండ,గోప్య తాండ,తాటిపల్లి గ్రామాలలో నాసిరకం విత్తనాల నిర్మూలన మరియు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవోలు సమావేశంలో మాట్లాడుతూ....రైతులు విత్తనాలను లైసెన్సు ఉన్న డీలర్ వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, మరియు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని, విత్తనాలను కోనుగోలు చేసిన రశీదు మరియు ఖాళీ సంచులను పంట కాలం ముగిసేవరకు రైతులు తమ వద్ద భద్రపరచుకోవాలని, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తన బస్తా నిండుగా ఉన్నవాటిని మాత్రమే కొనుగోలు చేయాలని, కాళీ




ఉన్న విత్తనపు సంచులను కొనుగోలు చేయవద్దని తెలిపారు. మరియు ఈ వానాకాలం వరి పంటలో చేపట్టవలసిన సస్యరక్షన సాగు విధానం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సతీష్, శ్రీకాంత్, శివాని, నిఖిల్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

## మండల వ్యవసాయ అదికారిణి పద్మ





**మాక్లూర్,ప్రజాజ్యోతి,మే 30:** నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారిని పద్మ హెచ్చరించారు. అనుమతి లేని విత్తనాలు,ప్రభుత్వ నిషేధిత రసాయన మందుల అమ్మకాలు జరిపితే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.మండల కేంద్రంలోని పలు షాపుల్లో,గంగరమంద లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను బుదవారం ఆకస్మిక తనిఖీ చేశారు.దుకాణాల్లో విత్తన ప్యాకెట్లు,ఎరువుల నిల్వలు,స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.ఆమె



మాట్లాడుతూ ప్రభుత్వ ఆమోదిత విత్తనాలను అమ్మలని,రైతులకు పూర్తి వివరాలతో కూడిన రశీదు ఇవ్వాలని సూచించారు. గడువు ముగిసిన ఎరువులు, పురుగుల మందులు విక్రయించ వద్దన్నరు. దుకాణం ఎదుట స్టాక్,ధరలు,విత్తనాల వివరాలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అమ్మకాలు రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ చేయాలన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలను

# పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్



**రెంజల్ ప్రజా జ్యోతి మే 30 :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల బంగారు భవిష్యత్తును అందించే పాఠశాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని మండల ప్రత్యేక అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. రెంజల్ మండలంలోని దుపల్లి, కూనేపల్లి, దండిగుట్ట, బాగేపల్లి గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తో కలిసి ప్రత్యేక అధికారి పరిశీలించారు. పాఠశాల లోని మరుగుదొడ్లు, విద్యుత్ ,త్రాగునీటి ఇతర రిపేర్లను సంబంధించిన పనులను పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పాఠశాలలు ప్రారంభం కాకముందే పూర్తిస్థాయిలో పనులను చేయాలని అధికారులను ఆదేశించారు. వీరి వెంట మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు, ఎంపీవో గౌస్ ఉద్దీన్, ఏఈ, పాఠశాల కమిటీ నిర్వాకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# బోరు మోటర్ కేబుల్‌ను దొంగలించిన దుండగులు

**రెంజల్ ప్రజా జ్యోతి మే 30 :** రెంజల్ మండలంలోని దండిగుట్ట మరియు వీరన్న గుట్ట గ్రామ శివారులో గల బోరు మోటర్ కేబుల్ ను గుర్తుతెలియని దుండగులు దొంగలించినట్లు రైతులు వాపోయారు. వేసవికాలం పంటను వేసిన తర్వాత రైతులు వర్షాకాల పంట కోసం నారుమలను సిద్ధం చేసుకునేందుకు వెళ్లి శివారులో పొలాలను పరిశీలించగా అక్కడ ఉన్నటువంటి బోరు మోటర్ల కేబులు తోపాటు, స్టార్టర్ల డబ్బాలను కూడా గుర్తు తెలియని దుండగులు ఎత్తుకు వెళ్ళినట్లు గుర్తించారు. దొంగిలించినటువంటి దుండగులను గుర్తించి రైతులను కాపాడాలని కోరుతున్నారు. పోలీసులకు సమాచారాన్ని అడగక తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ తెలిపారు.

# ఘనంగా సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవ్గం



**అశ్వారావుపేట ఆర్ సి మే 30 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజక వర్గం అశ్వారావుపేట:- కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడం కోసం ఐక్యత మరియు పోరాటం నినాదంతో ఏర్పడిన సిఐటియు కు 54 సంవత్సరాలు నిండిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు 54 ఆవిర్భవ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని సమస్యల నుండి కాపాడడం, ఐక్య ఉద్యమాలను అభివృద్ధి చేయడంలో బలోపేతం చేయటంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందన్నారు. అనునిత్యం కార్మిక వర్గం యొక్క హక్కులు వేతనాలు, ప్రయోజనాలు పని పరిస్థితులు మెరుగుపరచడం కోసం విశేషమైన కృషి చేసిందని అన్నారు. శ్రామిక వర్గం ప్రాణాలర్పించి సాధించినటు వంటి హక్కులు చట్టాలను పాలక ప్రభుత్వాలు అమలు చేయడం లేదని,సమ్మె చేసే హక్కును సైతం ప్రశ్నిస్తున్నాయని అన్నారు. పాలక ప్రభుత్వాలు తమ విధానాలు ద్వారా కార్మికులు జీవనోపాధిని దుర్బర పరిస్థితులు, క్రూరమైన దాడులకు గురవుతున్నారన్నారు. ప్రజలను విభజించడానికి,వారి ఐక్యతను భంగం కలిగించడానికి మితవాద శక్తులు తీవ్రంగా ప్రయత్ని స్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కేశుపాక నరసింహారావు, బండి ఏసు,రాంబాబు, రమేష్ నాగేంద్ర, ఖాసిం, తదితరకార్మికులు పాల్గొన్నారు.